# అక్రమంగా ఇసుక, మట్టి రవాణా చేస్తే చర్యలు



మంథని: లారీలను తనిఖీ చేస్తున్న ఆర్ఎస్ రాజిరెడ్డి

మంథని, మే23: అక్రమంగా ఇసుక, మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంథని ఆర్ఐ రాజిరెడ్డి తెలిపారు. గురువారం సూరయ్యపల్లి క్రాసింగ్ వద్ద మట్టి, ఇసుక లారీలను తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీ చేసినట్లు తెలిపారు.

**నాలుగు లారీల పట్టివేత**

రామగిరి, మే 23 : మండలంలోని వివిధ గ్రామాల్లోని చెరువుల్లోంచి అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న నాలుగు లారీలను గురువారం తహసీల్దార్ ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకున్నారు. గత వారం నుంచి కమాన్‌పూర్ మండలం జూలపల్లి, రామగిరి మండలం సుందిళ్ల, జల్లారం గ్రామాల్లోని చెరువుల్లోంచి అనుమతి లేకుండా మట్టిని లారీల్లో కల్వచర్ల, రాఘవపూర్ ఇటుక బట్టీలకు తరిస్తున్నట్లు సమాచారం రాగా, పట్టుకుని రామగిరి పీఎస్‌కు అప్పగించినట్లు తహసీల్దార్ రాంచందర్‌రావు తెలిపారు.

## • చెరువు కాదు.. కాలేజీ మైదానం



ఓపెన్ జిమ్ చుట్టు చేరిన వరద నీరు



మైదానంలో వాకింగ్ చేస్తున్న వాకర్స్ సభ్యులు

పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం చెరువును తలపిస్తున్నది. బుధవారం రాత్రి పడిన వర్షానికి వరదతో నిండిపోయింది. ఎండకాలంలోనే ఇలా ఉందంటే..? వానకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పనక్కరలేదని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ గ్రౌండ్‌లో నిత్యం వందలాది మంది ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తుంటారు. పిల్లలు ఆటలు ఆడుతుంటారు. మైదానమంతా నీరు నిలువడం, బురదగా మారడంతో అటు ఆటలకు, ఇటు వాకింగ్ చేయటానికి వీలులేకుండా పోయిందని మార్నింగ్ వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మైదానంలో నీరు నిల్వకుండా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. - పెద్దపల్లి, మే23

**సంచులు లేవు.. కాంటాలు కావు.. లారీలు రావు..**

# నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- కొనుగోళ్లలో జాప్యం
- కేంద్రాల్లోనే కుప్పలుగా వడ్లు
- అకాల వానకు తడిసి నష్టపోతామని రైతుల ఆందోళన

*వడ్లు తూకం వేసేందుకు సంచులు లేకపోవడం.. లారీలు రాకపోవడం... కాంటా కాకపోవడం.. ఇలా పలు కారణాలతో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. వడ్ల కొనుగోళ్లలో జాప్యంతో రైతులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఇదేం గోసరా దేవుడా..? అంటూ నిట్టూరుస్తున్నారు. కొద్దిరోజులుగా అకాల వర్షాలకు ధాన్యం తడిచి మొలకలు వస్తున్నా పట్టించుకున్న వారేలేరని రైతులు వాపోతున్నారు. నెల రోజులు కావస్తున్నా కొనుగోలు కేంద్రా ల్లో ఉన్న వడ్లు అమ్ముడుపోక పైసలు రాక వానకాలం పంటల సాగెలా అని ఆందోళన చెందుతున్నారు.*





పెద్దపల్లి మండలం ముత్తారంలో తడిసిన వరిధాన్యం కుప్పలు, మొలకెత్తిన ధాన్యం

పెద్దపల్లిరూరల్, మే 23: పెద్దపల్లి మండలంలో పెద్దపల్లి, అప్పన్నపేట సింగిల్ విండోల పరిధిలో దాదాపు 28 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి అధికారులు కొనుగోళ్లు చేపడుతున్నారు. పెద్దపల్లి సింగిల్ విండో పరిధిలో 14 కొనుగోలు కేంద్రాలు, పెద్దపల్లి మండలం అప్పన్నపేట సింగిల్ విండోలో 17 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పెద్దపల్లి సింగిల్ విండో పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో ఒక్కో కొనుగోలు కేంద్రంలో దాదాపు 3 నుంచి 5 లారీల వడ్లు, అప్పన్నపేట సింగిల్ విండో పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో నాలుగు కేంద్రాల్లో పూర్తిస్థాయిలో కొనుగోలు పూర్తికాగా మిగిలిన కేంద్రాల్లో దాదాపు 30 వేల క్వింటాళ్ల వరకు ధాన్యం కుప్పలుగా పేరుకుపోయి ఉన్నట్లు అధికారులు, రైతులు చెబుతున్నారు. ఏది ఏమైనా రెండు సింగిల్ విండోల పరిధిలో ధాన్యం కొనుగోళ్ల నత్తనడకన సాగుతున్నాయని రైతులు వాపోతున్నారు. కొద్ది రోజుల్లో రోహిణి కార్తె ప్రవేశిస్తుండడంతో ఇటు కొనుగోలు కేంద్రాల వద్దే ఉంటూ అటు వానకాలం సీజన్‌కు పంటను సాగుకు సిద్ధం చేయడమెలా అని ఆందోళనలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

### కాంటాలు పెట్టమంటే సంచుల్లేవంటున్నరు



ఆరుగాలం కష్టపడి పండించిన పంట వానపాలవుతున్నది. కాంటాలు పెట్టమంటే సంచుల్లేవని వడ్లు కొంటలేరు, కాంటాలు పెడుతలేరు. నాకున్న 3 ఎకరాల పొలంలో 160 నుంచి 180 బస్తాల వరకు వడ్లు పండినయ్. 15 రోజులుగా కుప్పలు పోసుకుంటే వర్షాలు పడి వరదలో 5,6 బస్తాల వడ్లు నీళ్లలో కొట్టుకుపోయినయ్. ఇప్పుడేమో వడ్లు తడిసినయని కాంటా లు పెడుతలేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వడ్ల కాంటాలు పెడితే బతుకుతం. 15 రోజులుగా కేంద్రంలోనే పడిగాపులు కాస్తున్న.

**-మిట్టపల్లి వైకుంఠం, గౌరెడ్డిపేట (పెద్దపల్లి)**

### వడ్లు తెచ్చి నెలరోజులైనా కొనలేదు



కొనుగోలు కేంద్రంలో వడ్లు పోసి నెల రోజులైతంది. మొన్నటిదాకా ఎన్నికలన్నరు. ఇప్పుడేమో హమాలీలు కాంటాలు చేసినా లారీల్లేవని, మిల్లులు దించుకుంటలేరని కుంటి సాకులతో అరిగోస పెడుతున్నరు. వడ్లు కొనుగోలు కేంద్రంలో పోసుడేమో కాని ఇంకో పనిచేసుకోకుంట అయింది. అటు కాలం మీదికొచ్చిం ది. 25 నుంచి రోహిణి కార్తె వత్తంది. మల్ల వానకాలం పంటలకు భూములను పొతం చేసుకుందామంటే వర్షాలకు ఇక్కడ వడ్లు తడుస్తయని కుప్పల వద్దనే ఉంటున్నం. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం రైతుల వడ్లను తొందరగా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

**-రమేశ్, ముత్తారం, పెద్దపల్లి**

## శ్రీవారిని దర్శించుకున్న కోలేటి దామోదర్



గోదావరిఖని, మే 23 : తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గురువారం దర్శించుకొన్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

## 26 నుంచి వాలీబాల్ పోటీలు



జూలపల్లి : మైదానాన్ని పరిశీలిస్తున్న నిర్వాహకులు, క్రీడాకారులు

జూలపల్లి, మే 23 : జూలపల్లిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 26, 27 తేదీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు సన్నాహాలు చేస్తున్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు, సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు దారబోయిన నరసింహం, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మడవేని రాజయ్య, క్రీడాకారులు కలిసి గురువారం క్రీడామైదానం పరిశీలించి మాట్లాడారు. తన తండ్రి దారబోయిన లింగయ్య జ్ఞాపకార్థం తన సోదరుడు ప్రవాస భారతీయుడు దారబోయిన మధూకర్‌తో కలిసి పోటీలు నిర్వహిస్తున్నట్లు నరసింహం పేర్కొన్నారు. పోటీలకు ఉమ్మడి జిల్లాలోని దాదాపు 24 ప్రధాన జట్లను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఇక్కడ నాయకులు కొప్పుల మహేశ్, అడువాల తిరుపతి, మెరుగు రమేశ్, కొమ్మ పోశాలు, సీనియర్ క్రీడాకారులు భూసారపు రవీందర్‌గౌడ్, బొమ్మనవేని సతీశ్, ఆవుల రాజు, మల్లెత్తుల సంతోశ్ పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



పెద్దపల్లి: బాధితులకు ఆర్థిక సాయం చేస్తున్న వ్యాపార్తులు

పెద్దపల్లి, మే 23: పెద్దపల్లి పట్టణం మెయిన్ రోడ్‌లోని 3 షాపులు షార్ట్ సర్క్యూట్‌తో ఈ ఏడాది మార్చి 8న దగ్ధం కాగా, పెద్దపల్లి చాంబర్ ఆఫ్ కామర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేకరించిన రూ. 85 వేలను బుధవారం బాధితులకు అందజేశారు. ఇక్కడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమల్ కిశోర్ శారద, ప్రధాన కార్యదర్శి సయ్యద్ మస్రత్, ఉపాధ్యక్షుడు మాడూరి వినోద్‌కుమార్, కోశాధికారి కొమురవెల్లి జయప్రకాశ్, మిట్టపల్లి మధునయ్య, హైటెక్ శ్రీనివాస్, కట్ట సదానందం పాల్గొన్నారు.


**ప్రకటన**

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, శ్రీ ఆడెపు సుజాత, W/o. ధర్మారాజు, వయస్సు 48 సం.లు, Occ: బిజినెస్, H.No. 5-78/1, గ్రా।। గుడిపల్లి, మం।। పాలకుర్తి, జిల్లా పెద్దపల్లి, (Assessment No. 1015), గల ఖాళీ స్థలం 560.74 ఆర్‌సిసి కప్పు గల ఇల్లు లో కల ఈ హద్దులు.

తూర్పు : లింగయ్య గారి ఖాళీ స్థలం

పడమర : రోడ్డు

ఉత్తరం : ఎం. శంకరయ్య గారి ఇల్లు

దక్షిణం : ఆర్. పర్వతాలు గారి ఇల్లు

కల దానిని యజమాని అయి ఉండి సంపూర్ణ స్వాదీనములో ఉండి నాక్లయింట్ మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచ్ పెద్దపల్లి వారి వద్ద తనఖా పెట్టుచున్నారు. కావున ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపణలు కానీ ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన (7) రోజుల లోపల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు: Sd/- పిన్నింటి అశోక్, అడ్వకేట్, ఇ.నెం.3-7-852/1.వావిలాలపల్లి,కరీంనగర్ సెల్: 9849331558

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.

NT-327722-All

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571, 91827 77194


## కొనుగోళ్లలో జాప్యంపై రైతుల ఆగ్రహం

- జూలపల్లిలో అధికారులతో వాగ్వాదం



జూలపల్లి మండలకేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

జూలపల్లి, మే 23 : ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయడంపై జూలపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. లారీలు, హమాలీల కొరత తీర్చడంపై పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం దెబ్బతిన్నదని, ఓ వైపు వానలు తరుముతున్నా ధాన్యం తూకం వేయడంలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఉరుములు, మెరుపులు, గాలి వానలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని, వడ్ల కుప్పలపై ఎన్ని రోజులు పరదాలు కప్పుకుంటూ ఉంటామని ప్రశ్నించారు. తడిసిన ధాన్యం ఆరబెట్టుకుంటూ ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటవెంటనే ధాన్యం తూకం వేసి తరలించాలని కోరారు. తహసీల్దార్ బషీరొద్దీన్, సింగిల్ విండో సీఈవో సురేశ్ రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

### కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై జీఎంకు వినతి

యైటింక్లయిన్‌కాలనీ, మే 23 : సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ ఆర్జీ-2 ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఇక్కడ సందీప్, మహేందర్, శ్రీనివాస్, నారాయణ, పాషా, భూమయ్య, శ్రీకాంత్, శంకర్ ఉన్నారు.

### ప్రశాంతంగా ఎడ్‌సెట్

రామగిరి, మే 23 : తెలంగాణ ఎడ్‌సెట్ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రశాంతంగా ముగిసింది. 83 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 150 మందికి 123 మంది, మధ్యాహ్నం 150 మందికి125 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్ రెడ్డితెలిపారు. మధ్యాహ్నం నిర్ణీత సమయం ముగిసేసరికి ఒక విద్యార్థిని ఆలస్యంగా రావడంలో అనుమతించలేదు.

### గిరిజన గురుకుల కళాశాలలో ప్రవేశాలు

మంథని, మే 23: గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జే కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల గిరిజన గిరిజన విద్యార్థులు తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని గురుకుల కళాశాలలో ఈనెల 25న నిర్వహించే కౌన్సిలింగ్‌కు అర్హత పత్రాలతో హాజరు కావాలన్నారు. వివరాలకు 77699359, 9542408218లో సంప్రదించాలని తెలిపారు.

### పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

పెద్దపల్లిరూరల్, మే 23: పాలిసెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పెద్దపల్లి జిల్లా కో ఆర్డినేటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనర్సయ్య అన్నారు. పెద్దకల్వలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పరీక్షలకు సంబంధించిన అధికారులు, అబ్జర్వర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పరీక్షల నిర్వహణ తీరు పై సమీక్షించారు. సమావేశంలో జిల్లా అసిస్టెంట్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, స్పెషల్ అబ్జర్వర్ రాజేశ్వర్‌రావు, ఐదు సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

### కాంట్రాక్టర్‌పై హత్యా నేరం కేసు నమోదు చేయాలి

ఫర్టిలైజర్‌సిటీ, మే 23: గోదావరిఖని ప్రభుత్వ ఏరియా దవాఖాన ఆవరణలో చేపట్టనున్న నూతన భవనానికి తీసిన గుంతలోపడి మృతిచెందిన రావుల విజయ్ మృతికి కారణమైన కాంట్రాక్టర్‌పై హత్యానేరం కేసునమోదు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు కందుకూరి రాజారత్నం, మద్దెల దినేశ్ పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సంబంధిత కాంట్రాక్టర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ నాయకులు రమేశ్‌కుమార్, మొండి, రాము, ప్రసాద్, రాంబాబు, రాజు, ఫైట్‌ఫర్ బెటర్ సొసైటీ నాయకులున్నారు.

### నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

పెద్దపల్లి, మే 23: జిల్లాలోని ప్రభుత్వ దవాఖానలు, వైద్య కళాశాలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పెద్దపల్లి విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజినీర్ బొంకూరి సుదర్శనం గురువారం తెలిపారు. సింగరేణి ప్రభుత్వ వైద్య కళాశాలలో 320 కేవీకే జనరేటర్ అందుబాటులో ఉందన్నారు. అన్ని ప్రభుత్వ దవాఖానలు, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో విద్యుత్ సరఫరాలో సమస్యలకు అధికారులతో సంప్రదించడానికి ప్రత్యేక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

# తల్లిదండ్రులు ఆస్తి పంచి ఇవ్వడంలేదని..

- భార్యాబిడ్డలతో కలిసి కొడుకు ఆత్మహత్యాయత్నం
- పాలకుర్తి మండలం జయ్యారంలో ఘటన



ఇంటి ముందు పెట్రోల్ డబ్బాలతో నిరసన తెలుపుతున్న మేరుగుపర్వతాలు, భార్యాపిల్లలు

పాలకుర్తి, మే23: తల్లిదండ్రులు వారసత్వంగా వచ్చిన ఆస్తిని పంచివ్వకుండా కొన్నేళ్లుగా ఇబ్బందిపెడుతుండడంతో కొడుకు భార్యాపిల్లలతో కలిసి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన గురువారం మండలంలోని జయ్యారంలో జరిగింది. బాధితులు తెలిపిన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని మేరుగు గట్టమ్మ-పెద్దగట్టయ్య దంపతులకు కొడుకు పర్వతాలు, ముగ్గురు బిడ్డలు. వీరి పేరిట ఏడెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. ఈ భూమిని తన పేరిట చేయాలని పర్వతాలు తల్లిదండ్రులను వేడుకుంటున్నాడు. అయినా వారు వినకపోవడంతో పెద్ద మనుషుల సమక్షంలో మాట్లడగా నాలుగెకరాల భూమిని పర్వతాలు బిడ్డల పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు ఒప్పుకున్నాడు. రెండు నెలల కిందట స్లాట్ బుక్ చేశారు. అయితే తెల్లారే గట్టమ్మ- పెద్దగట్టయ్య కూతుర్లు జయ్యారానికి వచ్చి తల్లిదండ్రులను వెంట తీసుకెళ్లారు. అప్పటి నుంచి పర్వతాలు ఇటు బంధువులు, అటు అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. ఇగ న్యాయం జరగదని ఆవేదని గురయ్యాడు. ఈక్రమంలో గురువారం పెట్రోలు డబ్బాలతో భార్యాపిల్లలతో కలిసి నిరసన తెలిపాడు. కొద్దిసేటి తర్వాత ఇంట్లోకి వెళ్లి భార్యాపిల్లలు, తనపై పెట్రోలు పోసుకొని గ్యాస్ లీక్‌చేసి ఆత్మహత్యాయత్నం చేశారు. చుట్టుపక్కల వారు గమనించి అక్కడికి చేరుకొని తలుపులు బద్దలు కొట్టి వారిని బయటకు తెచ్చారు. వెంటనే బసంత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకొని పర్వతాలు కుటుంబీలకు కౌన్సెలింగ్ చేసి సర్ధిచెప్పారు.

### విత్తన మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కమాన్‌పూర్, మే 23: కరీంనగర్, జగిత్యాల జిల్లా కేంద్రాల్లో గల విత్తన పరిశోధన స్థానాల్లో శుక్రవారం విత్తనమేళా నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కమాన్‌పూర్ మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఆయా పరిశోధన స్థానాల్లో శాస్త్రవేత్తలు రూపొందించిన వివిధ రకాల విత్తనాలను విక్రయిస్తారని తెలిపారు.

### పవర్ క్విజ్ విజేతగా రామగుండం ఎన్టీపీసీ

జ్యోతినగర్, మే 23: ఎన్టీపీసీ వ్యాప్తంగా గురువారం న్యూఢిల్లీ నోయిడాలోని ఎన్టీపీసీ పవర్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ (పీఎంఐ)లో గురువారం జరిగిన జాతీయ స్థాయి పవర్ క్విజ్ పోటీల్లో రామగుండం ఎన్టీపీసీ, తెలంగాణ ప్రాజెక్టు విజేతగా నిలిచింది. ఎన్టీపీసీ డీజీఎం ప్రాగ్‌సూద్, ఏజీఎం హర్మీత్‌బగ్గా బహుమతులను అందుకున్నారు.

### స్నేహితుడికి ఆర్థిక సాయం

కాల్వశ్రీరాంపూర్, మే 23: కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన ఎండీ యాకూబ్ కు తోటి స్నేహితులు అండగా నిలిచారు. యాకూబ్ అనారోగ్యంతో బాధపడుతూ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. యాకూబ్‌తో కాల్వశ్రీరాంపూర్‌లో 10 వతరగతి చదువుకున్న 2002-03 సంవత్సరం మిత్రులు రూ.20వేల నగదు అందజేసి అండగా నిలిచారు. ఇక్కడ చిలుముల శ్రీనివాస్, ఆషాడపు సురేశ్, జాలిగం రాజ్‌కుమార్, కలవేణ స్వామి, మెట్టు శ్రీకాంత్, తదితరులున్నారు.

### ఆదర్శలో ప్రవేశాలకు ఆహ్వానం

జూలపల్లి, మే 23 : పెద్దాపూర్‌లోని ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మశ్రీ పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో 40 సీట్ల చొప్పున ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 31లోగా నేరుగా, లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. బాలికలకు హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## టార్గెట్లను సకాలంలో పూర్తి చేయాలి



పెద్దపల్లి: మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక కమిషనర్ బీ షఫియుల్లా

పెద్దపల్లి, మే23: ఉపాధి హామీ పథకం కింద కేటాయించిన టార్గెట్లను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక కమిషనర్ బీ షఫియుల్లా సూచించారు. గురువారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి ఆయన జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఉపాధి హామీ పనుల లక్ష్యాలు, లేబర్ టర్న్ ఔట్, మొక్కల పెంపకం వివరాలు, స్వచ్ఛ భారత మిషన్, గ్రామాల్లో పారిశుధ్య చర్యలు, తదితర వివరాలను మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. రాబోయే వర్షాకాలంలో జిల్లా వ్యాప్తంగా పెద్దసంఖ్యలో మొక్కల పెంపకం కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీవో రవీందర్, డీపీవో ఆశాలత, జడ్పీ సీఈవో నరేందర్, స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ మురళి, ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, ఏపీవోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- రాత్రంగా జాగారం చేసిన 12వ డివిజన్ వాసులు
- ఉదయం కార్పొరేటర్ జోక్యంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



గురువారం ఉదయం దగ్గరుండి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగింజేచేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు బొడ్డు రవీందర్

కోల్‌సిటీ, మే 23 : నగర పాలక సంస్థ 12వ డివిజన్ పరిధిలోని ఫైవింక్లయిన్ ఏరియాలో బుధవారం రాత్రి 10 గంటలకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి భారీగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల ఇండ్లలో నిద్రిస్తున్న జనాలు ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ బొడ్డు రజిత రవీందర్ వెంటనే సీనియర్ లైన్‌మెన్‌తో మాట్లాడి అప్పటికప్పుడు విద్యుత్ సరఫరాను నిలిపివేసి మంటలను ఆర్పివేయడంతో డివిజన్ ప్రజలకు పెను ప్రమాదం తప్పినట్లయింది. కరెంటు లేక రాత్రంతా ప్రజలు జాగారం చేయాల్సి వచ్చింది. గురువారం తెల్లవారగానే కార్పొరేటర్ అక్కడకు చేరుకొని వెంటనే సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకవెళ్లారు. అధికారులు సిబ్బందితో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది బిగించారు. గురువారం మధ్యాహ్నం కల్లా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కావడంతో డివిజన్ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇందుకు కృషి చేసిన కార్పొరేటర్‌కు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.


## అగ్రిమెంట్ ప్రకారం వేతనాలు చెల్లించాలి



దవాఖాన ఎదుట కార్మికుల నిరసనకు మద్దతుగా బాబర్ సలీంపాషా

జ్యోతినగర్, మే 23: రామగుండం ఎన్టీపీసీలో యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు చేసిన అగ్రిమెంట్ ప్రకారం ఎన్టీపీసీ దవాఖానలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు, అలవెన్సులు చెల్లించాలని ఎన్టీపీసీ ఎన్‌బీసీ మెంబర్ బాబర్ సలీంపాషా డిమాండ్ చేశారు. గురువారం టౌన్‌షిప్‌లోని ధన్వంతరి దవాఖాన కార్మికులు చేపట్టిన నిరసనకు మద్దతుగా పాల్గొని మాట్లాడారు. ఆన్‌లైన్‌లో టెండర్ దక్కించుకున్న నూతన కాంట్రాక్టర్లు కార్మికులకు, పీఎఫ్, ఈఎస్ఐ లాంటి వసతులు 9 నెలలుగా అందించడం లేదన్నారు. అగ్రిమెంట్ ప్రకారం వేతనాలు, ఏరియర్స్ అందించకుంటే రీజినల్ లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తామని, పరిష్కారం లభించని యెడల ఆర్బిట్రేషన్‌కు వెళ్లి యాజమాన్యంపై, కాంట్రాక్టర్ల మీద కేసు వేస్తామని హెచ్చరించారు. ఇక్కడ కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారు.

## కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలి



పెద్దపల్లి రూరల్: కొత్తపల్లిలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, తదితరులు

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్ రూరల్, మే 23: ధాన్యం కొనుగోళ్లు, రైస్‌మిల్లులకు తరలింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ జి శ్యాంప్రసాద్‌లాల్ సూచించారు. పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లిలో గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లిలోని ధనలక్ష్మి రైస్‌మిల్‌లో ధాన్యం దిగుమతి కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినవెంటనే రైస్‌మిల్‌లో దిగుమతి చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, పెద్దపల్లి సింగిల్ విండో సీఈవో మెట్టు మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పెద్దపల్లి టౌన్, మే 23: పట్టణంలోని ఆదర్శనగర్ బంధంపల్లి చెరువు సమీపంలోని వ్యవసాయ కాలువలో గురువారం గుర్తు తెలియని మృతదేహాన్ని పెద్దపల్లి పోలీసులు గుర్తించారు. దాదాపు 45 ఏళ్లు, తెల్లని చొక్కా, నీలిరంగు లుంగీ ధరించిన మృతుని ఆచూకీ తెలిసిన వారు 8712656505, 8712656506లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

### విత్తనాలను ఎమ్మార్పీ ధరకే విక్రయించాలి

కాల్వశ్రీరాంపూర్, మే 23 : రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని పెద్దపల్లి ఏడీఏ శ్రీనాథ్ సూచించారు. మండలంలోని పెగడపల్లి రైతు వేదికలో కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల ఎరువులు, పురుగుమందుల వ్యాపారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలు పాటించనివారి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఇక్కడ ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

పాలకుర్తి, మే 23: పాలకుర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను గురువారం బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి, మండల వ్యవసాయాధికారి ప్రకాశ్ తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.